**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 01 జూలై, 2023.

# ముంచాలని చూస్తే.. ఘోరి కడతారు

## నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందే

## నిర్వాసితుల బాధ్యత నుంచి కేంద్రం తప్పించుకోవడం దారుణం

## నెత్తిన పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి -బిజెపిని ప్రజలు ఛీకొట్టే రోజులు దగ్గర్లోనే

## ఏలూరు సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నిర్వాసితులకు పరిహారం అందించకుండా ముంచాలని చూస్తే బిజెపి, వైసిపిలకు ప్రజలు ఘోరి కడతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పోలవరం పోరుకేక పాదయాత్ర 12వ రోజు శనివారం జిల్లా కేంద్రమైన ఏలూరులో ప్రారంభమైంది. తంగెళ్లమూడి వంతెన, 12 పంపుల సెంటర్, పవర్‌పేట రేల్వేస్టేషన్ కూడలి మీదుగా ఆర్ఆర్‌పేట్ వరకూ పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆర్ఆర్‌పేట పార్క్ వద్ద జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. 12 రోజులుగా సాగుతున్న ఈ పాదయాత్ర నిర్వాసితుల కడుపు మంట యాత్రగా అభివర్ణించారు. పదేళ్లుగా చూసి విసిగిపోయి ఏదోకటి తేల్చుకోవాలనే కసితో ఆదివాసీలంతా యాత్ర చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ 270 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగిందన్నారు. నిర్వాసిత మండలాలైన అల్లూరి సీతారామరాజు జిల్లా, కుక్కునూరు, వేలేరుపాడు గ్రామాల్లో రోడ్లు నరకప్రాయంగా ఉన్నాయన్నారు. నిర్వాసిత గ్రామాలను పూర్తిగా గాలికొదిలేశారని తెలిపారు. ఇప్పటికే పోర్టులు, రోడ్డు వంటివాటిని మింగేస్తున్న అదాని జీలుగుమిల్లిలో ఆయుధ ఫ్యాక్టరీ పెట్టి కబళించాలని చూస్తున్నారన్నారు. ఈ మండలంలో ఆరు వేల ఎకరాలు సేకరించి నిర్వాసితులకు కాలనీలు కడుతున్నారని తెలిపారు. పరిహారం ఇవ్వకపోవడంతో ఇప్పటి వరకూ 20 శాతంకు మించి కుటుంబాలు రాలేదని తెలిపారు.

నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం పూర్తికాకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. పోలవరం డిజైన్లన్నీ పనికిమాలినవని, దీనికి ఏ ఇంజినీర్‌తోనైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తొలివిడతగా 20 గ్రామాలు మునక అని చెప్పి ఇప్పుడు 36 గ్రామాలను చేర్చారని, అప్పుడు లెక్కలు తప్పని తేలిపోయిందన్నారు. ప్రాజెక్టు అంతా తప్పుల తడకగా కొనసాగుతుందన్నారు. నిధులన్నీ కాంట్రాక్టర్లు, మంత్రులు, నాయకులు పంచుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం నిర్వాసితుల సమస్యను తన బాధ్యత కానట్టుగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెత్తిన వేసుకుంది గనుక సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు కులం, మతం పేరుతో సొల్లు కబుర్లు చెబుతారని, కేంద్రంలోని తమ మోడీని మాత్రం నిర్వాసితుల సమస్య గురించి అడగరన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు బిజెపికి అడుగులొత్తడం దారుణమన్నారు. బిజెపిని ప్రజలు ఛీకొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ నెల నాలుగో తేదీన సభ అనంతరం కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రభుత్వం దిగిరాకపోతే ప్రతి గ్రామాన్ని సమర క్షేత్రంగా మారుస్తామన్నారు.

## ఆయన ఇవ్వడం లేదు.. ఈయన అడగడం లేదు

## పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు దారుణం

## రాజకీయ పార్టీలన్నీ దీనిపై మాట్లాడాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

పోలవరం నిర్వాసితులకు పరిహారం కింద రూ.30వేలు కోట్లు ఇవ్వాల్సి ఉందని, కేంద్రం నిధులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేంద్రంలో మోడీ ఇవ్వడం లేదని, సిఎం జగన్ అడగడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏలూరులో పోలవరం పోరుకేక పాదయాత్రకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందంతో కలిసి నడిచి ఆర్ఆర్‌పేట పార్క్ వద్ద జరిగిన బహిరంగ సభలో పాల్గొని రామకృష్ణ మాట్లాడారు. 2020కు పోలవరం పూర్తిచేస్తామని చెప్పి నాలుగేళ్లు అయ్యిందన్నారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు ఇళ్లు, భూమి, ఉపాధి లేకుండా పోయిందన్నారు. వారు త్యాగాల కారణంగానే పోలవరం పూర్తవుతుందన్నారు. మంత్రులు, మేధావులు, రాజకీయ పార్టీలు నిర్వాసితుల సమస్యలపై మాట్లాడాలన్నారు. పోలవరం పూర్తయితే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, నిర్వాసితుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పోలవరం మొదలై దశాబ్దకాలం గడిచినా ఇళ్లు, పరిహారం, ఉపాధి చూపించలేదన్నారు. మోడీని నిధులు అడిగే పరిస్థితిలో జగన్ లేరన్నారు. నిర్వాసితుల సమస్య పరిష్కారం కావాలంటే నిధులు కావాలన్నారు. ఢిల్లీలో రాష్ట్ర బిజెపి నాయకులు నిర్వాసితుల గురించి అడగడం లేదన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు.

పాదయాత్రకు టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్, ఆలిండియా లాయర్స్ యూనియన్, చేతివృత్తిదారుల సంఘంతోపాటు పలు సంఘాలు ఘనస్వాగతం పలికి సంఘీభావం తెలిపాయి.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, వి.ఉమామహేశ్వరరావు జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం రాష్ట్ర నాయకులు, కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వరరావు, యం.భాస్కరయ్య, జి.బేబిరాణి, జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ నాయకులు డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

J. Jayaram

**(జె.జయరాం)**

ఆఫీసు కార్యదర్శి